క్లుప్తంగా

వధూవరులకు దద్దాల ఆశీర్వాదం


వరుడితో దద్దాల నారాయణ, చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: స్థానిక షాదీఖానలో సోమవారం జరిగిన ఎస్కే హనీఫ్ కుమారుడి వివాహ వేడుకల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ నూతన వరుడు ఎస్కే షారూక్‌ను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, పెద్ద ఇస్మాయిల్, చిన్న ఖాశింసా, మదార్ వలి, సిద్ధిక్, మహబూబ్ బాషా, కోఆప్షన్ సభ్యుడు చింతం శ్రీనివాసులు, సర్పంచ్ స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, గొబ్బిళ్ల శ్రీను పాల్గొన్నారు.

మీ కోసం కార్యక్రమానికి అధికారుల గైర్హాజరు


మీ కోసం కార్యక్రమంలో తక్కువగా హాజరైన అధికారులు

సింగరాయకొండ: మండల రెవెన్యూ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే మీ కోసం కార్యక్రమానికి అధికారులు గైర్హాజరు అవుతుండటంతో ప్రజల నుంచి స్పందన కూడా కరువవుతోంది. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల మండల అధికారులు పాల్గొని ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరించి పరిష్కరించాల్సి ఉండగా, సోమవారం కేవలం మూడు శాఖల మండల అధికారులే పాల్గొన్నారు. తహసీల్దార్ టి.రవి, ఎంపీడీఓ డి.జయమణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, ఆర్ఐ ప్రసాద్ మాత్రమే పాల్గొనగా, మిగిలిన శాఖల అధికారులు పాల్గొనలేదు. కేవలం మూడు అర్జీలే రాగా, వాటిలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం రెండు, జగనన్న లేఅవుట్‌లో రిజిస్ట్రేషన్ పట్టా కోసం మరో అర్జీ వచ్చినట్లు తహసీల్దార్ టి.రవి తెలిపారు.

అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్సై అనుక్

పొన్నలూరు: మండలంలోని ముండ్లమూరివారిపాలెం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తుండగా, పొన్నలూరు సెంటర్‌లో సోమవారం పోలీసులు పట్టుకున్నారు. పొన్నలూరులోని మద్యం షాపు నుంచి ముండ్లమూరివారిపాలెంలో బెల్ట్ షాపు నిర్వహణకు అక్రమంగా మద్యం బాటిళ్లు తీసుకెళ్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై అనుక్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని అతని నుంచి 26 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. మద్యం బాటిళ్లతో పట్టుబడిన వెంకటేశ్వర్లుతో పాటు అతనికి మద్యం సీసాలు సరఫరా చేసిన మద్యం షాపులోని సేల్స్‌మేన్‌పై కూడా కేసు నమోదు చేశామని, ఇద్దరినీ కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా సరే బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై అనుక్ హెచ్చరించారు.

భైరవకోన, మిట్టపాలెంలో భక్తుల సందడి


సాయిబాబా దేవస్థానంలో ప్రత్యేక పూజలు


పొన్నలూరు: ప్రత్యేక అలంకరణలో సంగమేశ్వరస్వామి


జమ్ములపాలెంలో ప్రత్యేక అలంకరణలో పంచముఖేశ్వరుడు


అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో ప్రత్యేక పూజలందుకుంటున్న స్వామి వారు


శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాథుని మూల విగ్రహమూర్తి


భైరవకోనలో దేవతామూర్తుల ఆలయాలను సందర్శించుకుంటున్న భక్తులు


కె.ఉప్పలపాడులో ప్రత్యేక అలంకరణలో మల్లికార్జునస్వామి


కాశీ విశ్వేశ్వర సమేత ఆలయంలో విశేష పూజలు


మిట్టపాలెంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


పామూరు భుజంగేశ్వర ఆలయంలో పూజలు

సీఎస్‌పురం (పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక కేంద్రం మండలంలోని భైరవకోన, మిట్టపాలెం నారాయణస్వామి క్షేత్రాల్లో కార్తీకమాసం నాలుగో సోమవారం వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా భక్తులు త్రిముఖదుర్గాదేవి, భర్గలేశ్వర, నగరేశ్వర, కాలభైరవ ఆలయాల వద్ద పెద్ద సంఖ్యలో కార్తీకదీపాలు వెలిగించి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. జలపాతం వద్ద ఉత్సాహంగా గడిపారు. కార్తీక సోమవారం పురస్కరించుకుని ఆలయాలను దేవస్థాన ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి, ముప్పాళ్ల శ్యాంసుందర్ రాజుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తీర్చిదిద్ది వసతులు కల్పించారు. మండలంలోని పుణ్యక్షేత్రం అయ్యలూరివారిపల్లె తిరుమలనాథస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామివారికి విశిష్ట పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం వేడుకలు

పామూరు: కార్తీకమాసం నాలుగో సోమవారం వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీ వల్లీసమేత భుజంగేశ్వరస్వామి ఆలయంలో భుజంగేశ్వర స్వామి వారికి అర్చకులు మహంకాళి శివప్రసాద్, అబ్బురాజు ఫణి, జొన్నాబొట్ల తేజలు ఏకాదశ రుద్రాభిషేకం, వల్లీ అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. స్థానిక శ్రీమదన వేణుగోపాలస్వామి, వరదరాజస్వామి, రమాసమేత వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయం, అయ్యప్ప ఆలయంతో పాటు సహస్రలింగేశ్వరస్వామి, అష్టాదశ శక్తిపీఠం, ద్వాదశజ్యోతిర్లింగాల ఆలయం, బొట్లగూడూరులోని కామాక్షీసమేత రామలింగేశ్వరస్వామి, దాదిరెడ్డిపల్లెలోని పార్వతీ సమేత నీలకంఠేశ్వర స్వామి, పడమటి కట్టకిందపల్లెలోని శ్యామలా కామాక్షి సమేత మల్లేశ్వరస్వామి, మోపాడు పంచాయతీ పరిధిలోని గొందిమల్లేశ్వరస్వామి, అనుమునిగిరి శ్రీ శివరామ బ్రహ్మక్షేత్ర ఆలయాల్లో ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేశారు. ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, భక్తులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: కార్తీక మాసం నాలుగో సోమవారం వేడుకలను కనిగిరిలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకించి శైవ క్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి. భక్తులు వేకువ జాము నుంచే ఆలయాలకు వెళ్లి కార్తీక దీపాలు వెలిగించి విశిష్ట పూజలు చేశారు. స్థానిక సాయిబాబా గుడిలో భవానీ శంకర స్వామికి మహాన్యాస పూర్వక, ఏకాదశ రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలు అత్యంత నియమ నిష్ఠలతో చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మారావు, వీసీ రామశాస్త్రి పాల్గొన్నారు. దొరువు వద్ద కాశీ విశ్వేశ్వర సమేత ఆలయం, కొండపై విజయమార్తాండేశ్వర స్వామి ఆలయం, బొడ్డు చావిడి వద్ద నాగ శిలలకు, కనకపట్నంలోని శివాలయం, పునుగోడులోని సిద్ధేశ్వర స్వామి ఆలయం, నందన మార్లెళ్ల బాల కోటేశ్వర స్వామి దేవస్థానంలో విశిష్ట పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

టంగుటూరు: కార్తీకమాసంలో చివరి సోమవారం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో గల శివాలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జమ్ములపాలెం గ్రామంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరాలయంలో పంచముఖేశ్వర స్వామి, 1116 శివలింగాలకు భక్తులు విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకాలు, గోత్రనామార్చన తదితర పూజలు చేశారు. పసుకుదురు గ్రామంలోని పురాతన శివాలయంలో, టంగుటూరు, పొందూరు శివాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంగమేశ్వరం ఆలయంలో...

పొన్నలూరు: మండలంలోని చెన్నిపాడు గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీగంగాసర్వ మంగళాంబ సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ పూజారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయగా, ఆలయ పెద్దలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కొండపి మండలంలో...

కొండపి: కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా మండలంలోని దైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుణ్యస్నానాలు చేసి దీపాలు వెలిగించారు. కొండపిలోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర ఆలయంలో అర్చకుడు కాలేశ్వర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కె.ఉప్పలపాడు శివాలయంలో మల్లికార్జునస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్దకళ్లగుంటలో శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకులు రామ్మూర్తిశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి రామలింగేశ్వరస్వామి స్పర్శ దర్శనం కల్పించారు. శివాలయాల్లో భక్తులు భారీ సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

రాజ్యాంగ ఆమోద దినోత్సవం జయప్రదం చేయాలి

● వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దద్దాల


దద్దాల (ఫైల్)

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశానుసారం ఈ నెల 26న మంగళవారం కనిగిరిలో 75వ భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కనిగిరిలోని ఒంగోలు బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఉదయం 9 గంటలకు నివాళులర్పించనున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ నాయకులు, మున్సిపల్ చైర్మన్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు విధిగా హాజరు కావాలని దద్దాల పిలుపు ఇచ్చారు.

ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం


మహ్మద్ సయనాబేగం

పామూరు: మండల కేంద్రం పామూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేస్తున్నట్లు కనిగిరి ఆర్టీసీ డీఎం మహ్మద్ సయనా బేగం తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌ను సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్టాండ్‌లో కొంతకాలంగా విద్యుత్ సమస్య ఉండగా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి అండర్‌గ్రౌండ్ పద్ధతిలో పైప్‌లైన్ వేయించి శాశ్వత మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. దుకాణాల షట్టర్స్‌కు మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. త్వరలో బస్టాండ్‌కు ప్రహరీ నిర్మాణానికి కూడా కృషి చేస్తామని, ప్రయాణికులకు అన్ని వసతులు సమకూర్చుతామన్నారు. ఆర్టీసీ సిబ్బంది, రిజర్వేషన్ బుకింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

మండల కోఆప్షన్ సభ్యుడికి పితృ వియోగం


బారాయిమామ్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

కనిగిరి రూరల్: మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్కే రహీం తండ్రి, మాజీ ఉప సర్పంచ్ ఎస్కే బారాయిమామ్ (76) ఆదివారం అర్ధరాత్రి మృతి చెందారు. ఈయన కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. ఎస్కే బారాయిమామ్ మృతికి వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ తీవ్ర సంతాపం తెలిపారు. మండలంలోని తాళ్లూరులో బారా యిమామ్ భౌతిక కాయాన్ని పార్టీ నేతలు సోమవారం సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సూరసాని మోహన్‌రెడ్డి, సర్పంచ్ మూలె మాలకొండారెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, బాలు రామిరెడ్డి, కే రమేష్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మహిళలపై హింసను అరికట్టాలి

● ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి


ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీఓ, సీఐ, చైర్మన్, అధికారులు

కనిగిరి రూరల్: మహిళలపై జరిగే హింసను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కనిగిరి డివిజన్ ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖ, గుడ్ హెల్ప్, ఎన్జీవో సంఘాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సృష్టికి మూలమైన మహిళా మూర్తిని గౌరవించుకోవాల్సిన ఆవశ్యకత సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. మహిళా రక్షణ కోసం ప్రభుత్వం అనేక చట్టాలు తెచ్చిందని, అయినా పలు చోట్ల లైంగిక వేధింపులు, అత్యాచార ఘటనలు జరగడం బాధాకరమన్నారు. మున్సిపల్ చైర్మన్, న్యాయవాది ఎస్కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ మహిళా చట్టాలు, మహిళా సాధికారత, బాల్య వివాహాల నిర్మూలన, మహిళా హక్కులు తదితర అంశాలు వివరించారు. సీఐ ఎస్కే ఖాజావలి మాట్లాడుతూ గృహహింస, లైంగిక వేధింపులు, లింగ వివక్ష, సైబర్ బాధితులు పోలీస్ ఫోన్ నంబర్ 100, అత్యవసర సమీకృత ఫోన్ నంబర్ 112కు ఫిర్యాదు చేయాలని సూచించారు. తొలుత ప్రతిజ్ఞ చేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ పి.సరోజని, సూపర్‌వైజర్ సుమతి, మల్లేశ్వరి, ధనలక్ష్మి, గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్, జీకే ఫౌండేషన్ కో ఆర్డినేటర్‌లు మంద్రు రమేష్, జి. నవకుమార్, రాజేష్, పోలీస్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

కొండపి: మండలంలోని పెరిదేపి గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సీపీఎం నాయకులు తెలిపారు. కామ్రేడ్ ముప్పరాజు శేషయ్య 24వ వర్ధంతి సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. కొండపి శ్రీవాణి మల్టీ స్పెషాలిటీ క్లినిక్ డాక్టర్ ఈఎస్ ప్రత్యూష్, ప్రజా వైద్యులు డాక్టర్ హరిబాబులు వైద్య సేవలందిస్తారని తెలిపారు. మందులు కూడా ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఆర్డీఓకు చైర్మన్ గఫార్ వినతి

కనిగిరి రూరల్: వివిధ సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో జరిగిన మీ కోసం కార్యక్రమంలో ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డికి చైర్మన్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన గఫార్ మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే మీ కోసం స్పందన కార్యక్రమంలో అన్ని శాఖ అధికారులు హాజరయ్యే విధంగా చూడాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వివిధ సమస్యల అర్జీలను ఆర్డీఓకు చైర్మన్ గఫార్ అందచేశారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

హనుమంతునిపాడు: సైబర్ నేరాలపై తప్పనిసరిగా అవగాహన ఉండాలని స్థానిక ఎస్సై మాధవరావు అన్నారు. సోమవారం చిన్న ముప్పాళ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు, మహిళలు, పిల్లలపై జరుగుతున్న నేరాలపై, ట్రాఫిక్, నిబంధనలు, రోడ్డు ప్రమాదాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు.

బ్యారన్లకు దారి చూపించాలని వినతిపత్రం

జరుగుమల్లి (సింగరాయకొండ): తమ బ్యారన్లకు వెళ్లేందుకు దారి చూపించాలంటూ జరుగుమల్లి మండలం పీరాపురం గ్రామానికి చెందిన మారంరెడ్డి చిన కొండయ్య, మారంరెడ్డి రమణమ్మలు సోమవారం ఒంగోలులో జరిగిన మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 22వ తేదీ గ్రామ టీడీపీ నాయకుల అండదండలతో మండల తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శి, సర్వేయర్, 15 మంది పోలీసులు వచ్చి తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా గత 40 సంవత్సరాలుగా ఉపయోగంలో ఉన్న గ్రామకంఠం స్థలంలో కొలతలు వేసి ఆ స్థలం చుట్టూ గుంతలు తీశారన్నారు. దాంతో తమ బ్యారన్ల వద్దకు రాకపోకలు సాగించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఈ విషయమై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తే గ్రామంలో లేకుండా చేస్తామని, కేసులు బనాయించి జైలుకు పంపిస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ బాధితులకు న్యాయం చేయాలని ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్నకు సూచించారు.